క్లుప్తంగా

చెన్నైలో కేజీఎఫ్ భారీ బహిరంగసభకు సన్నాహాలు

కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు జెట్టి కుసుమకుమార్



తెనాలి: మావారికి మేం సహకరించుకుంటూ సమాజంలోని ఇతర వర్గాలకు చేయూతనిస్తు న్నామనీ, దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేం దుకు కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) కృషిచేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు, ఏఐసీసీ సభ్యుడు జెట్టి కుసుమకుమార్ చెప్పారు. స్వస్థలమైన తెనాలి వచ్చిన సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ కమ్మ మహాసభలు విజయవంతమైన తదుపరి ఈ ఏడాది చివర్లో తమిళనాడులోని చెన్నైలో భారీ బహిరంగసభను తలపెట్టినట్టు ప్రకటించారు. కేవలం తమిళనాడులోని కమ్మ సమాజానికి చెందిన 10 లక్షల మందితో సభ నిర్వహణకు సన్నాహాల్లో ఉన్నామని తెలిపారు. సంకుచిత భావంతో కమ్మ కులమే గొప్పదని చాటటం కాకుండా సమాజానికి ఏం చేసింద న్నది చెబుతూ భవిష్యత్‌లోనూ కొనసాగించా లనేది తమ లక్ష్యంగా తెలిపారు. నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణంలో ముక్త్యాలరాజా దాతృత్వం ఉందనీ, రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఎన్నో మంచినీటి చెరువులు తవ్వించారని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా కమ్మ సంఘీయులు 2.10 కోట్లమంది ఉన్నారని, ఒక్క తమిళనాడులోనే 70 లక్షల మంది ఉన్నారని తెలిపారు. ఎన్టీ రామారావు వచ్చాకనే కమ్మ వర్గీయులు రాజకీయాల్లోకి వచ్చారనేది వాస్తవం కాదంటూ, ఆయనకు ముందే 59 మంది ఎమ్మెల్యేలు ఉండేవారని చెప్పారు. రాజకీయ, వ్యాపార, సేవారంగాల్లోనూ ముందంజలో ఉండాలన్న భావనతో పురోగమించా లనేది తమ ఆకాంక్షగా వివరించారు. వీరితో జెట్టి శివరామకృష్ణప్రసాద్, జెట్టి రావణబ్రహ్మ, జెట్టి అంకినీడు, తుమ్మల బాపయ్యచౌదరి, బుజ్జి, శ్రీగిరిష్, అమరేష్ తదితరులు కుసుమకుమార్‌ను సత్కరించారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కుచ్చెళ్లపాడు(వేమూరు): సామాజిక, ఆర్థిక చైతన్యం కలిగిన జీవితాలలో అభివృద్ధి సాధించాలంటే డాక్టర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్ర యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బొరుగడ్డ సుబ్బయ్య అన్నారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో భీమా కోరేగావ్ విజయోత్సవ సంబరాలు సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసిమళ్ల వెంకట రత్నం మాట్లాడుతూ 1818 జనవరి 1వ తేదీన 500 మంది మహర్ సైనికులు 28 వేల మంది పీష్వా సైన్యాన్ని 24 గంటల్లో నిద్రాహారాలు లేకుండా ఆత్మగౌరవం కోసం వీరోచితంగా పోరాడి విజయం సాధించారన్నారు. అందువల్ల ప్రతి ఏడాది జనవరి 13న కోరేగావ్ విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీరాజు, కొండెపూడి సునీల్, పెరికల సతీష్, వేమ రామరాజు, బోరుగడ్డ వీర స్వామి, పెరికల పృథ్వీచంద్, వెంకటేశ్వర్లు, ఎడ్ల రాజు, కొండేపూడి రవి, పెరికల ఆదిశేషు, బొరుగడ్డ పవన్, కళ్యాణ్, వాసిమళ్ల రతన్‌రాజు, నెమలికంటి గోపి, తలకాయల అశోక్, పెరికల లాజర్, పెరికల ధనష్, పెరికల వినాయకులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

రేపల్లె రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని మోర్లవారిపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో మోర్లవారిపాలెంలో దాడులు నిర్వహించగా గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడ్డారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.1200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ముగ్గురు కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

నిజాంపట్నం: ముగ్గురు కోడి పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని కేసనవారిపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. అడవులదీవి ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో దిండి పంచాయతీ కేసనవారిపాలెం గ్రామంలో దాడులు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి ఒక కోడి పుంజు, రూ.590 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా భోగి

- తోడైన శివముక్కోటి
- ఆలయాల్లో విశేష పూజలు



పాతశివాలయంలో ఉత్సవమూర్తులకు ఆలయ ప్రదక్షిణలు



గంగానమ్మపేట సుందరయ్య వీధిలో స్థానికుల భోగి మంటల సందడి

తెనాలి: భోగభాగ్యాలనిచ్చే భోగి పండుగను తెనాలి ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే లేచి భోగి మంటలు వేస్తూ సందడి చేశారు. పిల్లలనుంచి పెద్దల వరకు భోగి వేడుకల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణ వీధుల్లోని కూడలి ప్రాంతాలు భోగి మంటలు వెలుగులీనాయి. పట్టణంలో చిన్నతిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం వైకుంఠపురంలో భోగి పండుగ వేడుకలు ఘనంగా జరిపారు.తెల్లవారుజాము నుండే భక్తులు ఆలయానికి తరలివచ్చి వైకుంఠవాసునికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అద్దాల మండపంలో గోదా కళ్యాణం చేశారు. భోగిపళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు చిన్నారులకు సామూహికంగా భోగిపళ్లు పోసి ఆశీస్సులు అందజేశారు. పండుగ విశిష్టతను ఆలయ అర్చకులు తెలియజేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, ఆలయ సహాయ కమిషనర్ వి.అనుపమ పర్యవేక్షించారు. మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం స్వామి వారి తెప్పోత్సవం ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

చారిత్రక పాతశివాలయంలో...

స్థానిక గంగానమ్మపేటలో పాత శివాలయంగా ప్రసిద్ధి చెందిన చారిత్రక శ్రీపర్వతవర్ధినీ సమేత రామేశ్వరస్వామి దేవస్థానానికి భోగి రోజున భక్తులు భారీగా తరలివచ్చారు. సోమవారం రోజున భోగి పండుగ, పౌర్ణమి, అన్నింటికీ మించి విశేషమైన ఆరుద్రా నక్షత్రంలో కూడిన శివ ముక్కోటిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఉదయం నుండి రామేశ్వర స్వామి వారికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. శివ ముక్కోటిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రదక్షిణలు చేశారు. భక్తులు స్వామి వారి పల్లకీ మోస్తూ ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. భక్తుల శివ నామస్మరణతో ఆలయం మార్మోగిపోయింది. ఆలయ ఈవో వీవీ రమణ కుమారి ఉత్సవాలను పర్యవేక్షించగా శివ ముక్కోటి విశిష్టతను అర్చకులు తెలియజేశారు. శివముక్కోటి ఆరుద్రోత్సవం సందర్భంగా భక్తులు జంగమ దేవరులకు అల్పాహారం పంపిణీ చేశారు.



శ్రీచంద్రమౌళేశ్వర స్వామికి ఆరుద్ర నక్షత్రం శివముక్కోటికి అన్నాభిషేకం

ముగిసిన ధనుర్మాస వ్రత మహోత్సవాలు...

స్థానిక వీఎస్సార్ అండ్ ఏవీఆర్ కళాశాల రోడ్డులోని ప్రత్యేక వేదికపై గత నెల 16వ తేదీనుండి జరుగుతున్న ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ మహోత్సవాలు భోగిరోజుతో ముగిశాయి. శ్రీ శరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజ దాస స్వామి నేతృత్వంలో నెల రోజుల పాటు ప్రతి రోజు విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. చివరి రోజున నాడు శ్రీగోదా రంగనాధుల కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 మంది దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ప్రియదర్శిని గ్రూప్ విద్యాసంస్థల అధినేత చందు రామారావు-విజయలక్ష్మి దంపతులతో పాటు పున్నారావు, విష్ణుమొలకల వాలేశ్వరరావు, విజయలక్ష్మి, సోమరౌతు నాగేంద్రయ్య, సోమరౌతు గోపాలకృష్ణ, విష్ణుమొలకల శ్యామ్ సుందరరావు, గోపాళం శ్రీనివాసరావు, పూషడపు శివనాగమల్లేశ్వరరావు, తోట గోపి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. పట్టణ మారీసుపేటలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రం శివముక్కోటి సందర్భంగా సోమవారం అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొన్నారు.



వైకుంఠపురం దేవస్థానంలో గోదా కళ్యాణం

జనసేన కార్యాలయంలో..



శ్రీశరణాగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో గోదారంగనాథుల కళ్యాణోత్సవం

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో భోగి పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పల్లె వాతావరణం ప్రతిబింబించేలా కార్యాలయం ఆవరణను రంగవల్లులతో, గొబ్బెమ్మలతో తీర్చిదిద్దారు. పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులతో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ భోగి వేడుకల్లో పాల్గొన్నారు. భోగి మంటలను వెలిగించి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రైతాంగానికి కూటమి ప్రభుత్వం అండగా నిలబడిందని పేర్కొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర: భోగభాగ్యాలు అందించే భోగి పండగను సోమవారం ఆయా గ్రామాలల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రం కొల్లిపరతో పాటు మండలంలోని పలుగ్రామాల్లో భోగి మంటలతో సంక్రాంతి వేడుకలు సంప్రదాయబద్ధంగా ప్రాంభమయ్యాయి. అర్థరాత్రి మూడు గంటల నుంచి యువకులు భోగి మండల కోసం కలప, దుంగలు, చెక్కలు సేకరిస్తూ వీధుల్లో సందడి చేశారు. తెల్లవారుజామునే భక్తి శ్రద్ధలతో భోగి మంటల్లో పిడకలు వేసి సంప్రదాయాన్ని చాటారు. పలు గ్రామాల్లో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. తెల్లవారు జాము నుంచి హరినామ సంకీర్తనలు చేసుకుంటూ హరిదాసులు వీధుల్లో తిరిగారు. ప్రతి ఇంటి వద్దా మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వారికి కానుకలు సమర్పించారు. గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా బంధువులు, కొత్త అల్లుళ్ల రాకతో ఇళ్లు కళకళలాడుతున్నాయి. మహిళలు ఇళ్ల ముంగిటను రంగురంగుల ముగ్గులతో సుందరంగా అలకరించారు.



భోగి మంట వేస్తున్న మంత్రి మనోహర్



దావులూరు అడ్డరోడ్డు వద్ద తెల్లవారు జామున భోగి మంటలు వేస్తున్న స్థానికులు



కొల్లిపర మండల కేంద్రంలో భోగిమంట వేస్తున్న స్థానికులు

తెనాలి కళాసంస్కృతిని ప్రజ్వలింపజేసిన దుర్గాప్రసాద్

వర్ధంతి కార్యక్రమంలో కళారంగ ప్రముఖుల నివాళి


తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ ప్రజ్వలిత వ్యవస్థాపకుడు నాగళ్ల వేంకట దుర్గాప్రసాద్ నాలుగో వర్ధంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. బుర్రిపాలెంరోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి కళారంగ ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడుగా, ప్రజ్వలిత వ్యవస్థాపకుడిగా దుర్గాప్రసాద్ చేసిన కళాసేవను స్మరించుకున్నారు. కళా సాహిత్య రంగాల్లో తెనాలికి గల ఖ్యాతిని నేటి తరానికి తెలియజేస్తూ ఆయా రంగాల్లో పట్టణ వారసత్వం కొనసాగాలనే అభిలాషతో దుర్గాప్రసాద్ ఎన్నో కళా, సాహిత్య, సాంస్కృతిక సదస్సులు, నాటక ప్రదర్శనలు, ఉత్సవాలను నిర్వహించినట్టు సోదాహరణంగా చెప్పారు. రంగస్థల కళావైభవం, తెలుగు భాషా వికాసంలో సాహితీ ప్రక్రియలు, దిగంబర కవితోద్యమ వేడుకలు...వంటివి రాష్ట్రస్థాయి సదస్సులను ఉదహరించారు. ఆయన లేని లోటు తెనాలి కళా, సాహిత్యరంగాలకు తీరని లోటుగా విచారం వ్యక్తంచేశారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, ప్రముఖ పౌరాణిక నటుడు ఎం.రామలింగేశ్వరరావు మాట్లాడారు. బొల్లిముంత కృష్ణ, వజ్రాల రామలింగాచారి, బెల్లంకొండ వెంకట్, నన్నపనేని రాంబాబు, రామరాజు, ఆర్అండీబీ రాజు, చిట్టినేని సీతారామయ్య, పందిటి సుబ్బారావు, కొండముది రమేష్‌బాబు, దేవిశెట్టి కృష్ణారావు, సీహెచ్‌వీఎస్ ఫణికుమార్, గంజి దుర్గాప్రసాద్, కన్నెగంటి మధు, అలపర్తి వెంకటేశ్వరరావు, కాలేషావలి, అవిశె యోహాను, చందు సూర్య, కనపర్తి బెన్‌హర్, తెనాలి వినయ్, అబ్రహాం లింకన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులు శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు, రైల్వేస్టేషను వద్ద పేదల అన్నదానం కేంద్రంలోనూ అన్నదానం చేశారు.



దుర్గాప్రసాద్ కాంస్య విగ్రహం వద్ద నివాళి

కాకతీయ సేవాసమితి సంక్రాంతి సంబరాలు

తెనాలి: కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో సోమ వారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. అమరావతి కాలనీలోని చావాస్‌గ్రాండ్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటైన వేడుకల్లో భాగంగా ఉదయం భోగమంటలు నుంచి మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. హరిదాసులు, జంగమ దేవరలు, చిలకజోస్యం, గంగిరెద్దులు, పందెంకోళ్ల సందడితో కొనసాగాయి. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వెలగపూడి గోపాలకృష్ణప్రసాద్, బెజవాడ వెంకట్రావు, తెలంగాణ సభ్యులు బొడ్డు రవికుమార్, కాకతీయ కన్వెన్షన్ కమిటి అధ్యక్షుడు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, సంఘ నాయకులు అప్పసాని రాజేష్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, నన్నపనేని సుధాకర్, జెట్టి రావణబ్రహ్మ హాజరయ్యారు. కాకతీయ కమిటీ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో కార్యదర్శులు ముక్కామల మధుబాబు, చావా యదుకృష్ణ, ఉపాధ్యక్షుడు గుండపనేని కృష్ణయ్య, సంయుక్త కార్యదర్శి ఆవుల దశరామయ్య, సభ్యులు ఈదర శ్యాంప్రసాద్, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, అంచా రామ్‌చంద్, రావులపల్లి అనిత పర్యవేక్షించారు.



సంబరాల్లో క్యాలెండరు ఆవిష్కరణ

ఎంచుకునే లక్ష్యం గొప్పగా ఉండాలి

విద్యార్థులతో తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంచుకునే లక్ష్యాలు గొప్పగా ఉండాలని, దానికి తగిన కృషి కూడా అవసరమని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. మండల గ్రామం కొలకలూరు బాబు జగ్జీవన్ రామ్ రీడింగ్ రూమ్ కరుణా నిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజమిన్ ప్రాంగణంలో ఐటీసీఎల్ డీలర్ యడ్లపల్లి రవికిరణ్ సారథ్యంలో విద్యార్థులకు కెరీర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆది జాంబవ దళిత్ ఎంప్లాయిస్ సేవా సమితి(డెస్క్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పీజే రత్నాకర్ అధ్యక్షత వహించారు ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా గురువులు, తల్లిదండ్రులను గౌరవించడంతోపాటు సంస్కృతి సంప్రదాయాలను విస్మరించరాదన్నారు. పాఠశాల దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యలో రాణించాలన్నారు. 'కలలు కనండి.. దానిని సాకారం చేసుకోండి' అన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను గుర్తు చేస్తూ పలు ఉదాహరణలతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ కొలకలూరు గ్రామం కవులు, కళాకారులు, విద్యాదాతలు, విద్యావంతులకు నిలయంగా పేర్కొన్నారు. గ్రామంలో ప్రత్యేకించి దళితవాడ నుంచి ఐఏఎస్, ఐఆర్ఎస్, డాక్టర్స్, ఇంజినీర్స్ వంటి ఉన్నత స్థాయికి చేరిన గొప్ప వ్యక్తులు ఉన్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఎదగాలన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో డిగ్రీ, ఇంజనీరింగ్ స్థాయి విద్యార్థులకు ఉన్న అవకాశాలను వినర్చర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత ఉన్నం సంపూర్ణకుమార్ వెల్లడించారు. తమసంస్థ తరపున విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆంగ్లంలో పట్టు సాధించే విధానాలను పి రవిబాబు వివరించారు. విశ్రాంత పోస్టల్ ఉద్యోగి సుద్దపల్లి శరత్ వెంకయ్య, ఉపాధ్యాయుడు పి సురేష్ బాబు, ఎమ్మార్పీఎస్ నాయకురాలు ఆలపాటి కరుణ, ప్రముఖ న్యాయవాది సుద్దపల్లి మురళీ ధర్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్. వినయ్ కుమార్, పి. సాంబశివరావు, ఎస్. శ్రీనివాస్, ఎస్. అంబేద్కర్, వీఆర్వో కె. జార్జి థామస్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

రేణు అక్షయకు 'మానవత' సత్కారం

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత బాధ్యులు సోమవారం ప్రఖ్యాత మల్టీనేషనల్ కంపెనీ అమెజాన్‌లో రూ.40 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం పొందిన బి.రేణు అక్షయను సత్కరించారు. మానవత సభ్యుడు, ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ కామర్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాజీవ్ కుమార్తె రేణుఅక్షయ్య. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో అమెజాన్ కంపెనీలో ఇంటర్ షిప్ దరఖాస్తు చేశారు. కొనసాగింపుగా 2024లో ఇంజినీరింగ్ పూర్తి అయిన తరువాత కంపెనీ జరిపిన నాలుగు దశల ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనపరచి రేణు అక్షయ ఈ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆమె విజయం తెనాలికి గర్వ కారణమని మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్ అన్నారు. సంస్థ బాధ్యులతో కలిసి ఆమె తల్లిదండ్రులు పద్మావతి, రాజీవ్‌లను అభినందించారు. మానవత అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, వైస్‌చైర్మన్ పి.వాసు, సెక్రటరీ పి.వెంకట్,సభ్యులు ఏ.శ్రీనివాసరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.



రేణు అక్షయను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న డాక్టర్ రామ్‌చంద్

పల్లెటూరును కళ్లకు కట్టిన 'మట్టిమనిషి'

ఆకట్టుకున్న నాటకం


తెనాలి: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కళాతోరణంలో భాగంగా సోమవారం రాత్రి ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ప్రదర్శించిన నాటకం 'మట్టిమనిషి' ఒకనాటి పల్లెటూరును కళ్లకు కట్టింది. మట్టి విలువను చాటింది. మట్టిని నమ్ముకోకుండా అమ్ముకుంటే కలిగే దుష్ప్రభావాలను హెచ్చరించింది. పాత్రధారుల ఆహార్యం, రంగాలంకరణ, నాటకం మధ్యలో సన్నివేశాలు...అన్నీ ఆధునికత అంటని ఒకనాటి పల్లెటూరును తలపించాయి. కిక్కిరిసిన ఆడిటోరియంలో మూడుగంటలకుపైగా సాగిన నాటకం ప్రేక్షకులకు అనేక జ్ఞాపకాలను, అనుభవాలను గుర్తుచేసిందంటే అతిశయోక్తి కాదు. 'భూమిని నమ్ముకున్నోడు ఎన్నడూ చెడిపోడు' అనే సందేశాన్ని చాటింది. తెనాలికి చెందిన ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి రచించిన మట్టిమనిషి నాటకాన్ని మరో ప్రముఖ నాటకరచయిత, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ నాటకీకరించారు. హైదరాబాద్‌కు చెందిన మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో అదే పేరుతో ప్రదర్శించారు. యాభై మంది నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఈ నాటకాన్ని భారీస్థాయిలో తీర్చిదిద్దారు. రంగస్థల కళలో ఆరితేరిన నటుడు, రచయిత, దర్శకుడు, ప్రయోక్తి ఎస్ఎం బాషా, తన అనుభవాన్నంతా రంగరించి నాటకాన్ని సిద్ధంచేశారు. నటీనటులు అవధుల మేర నటించారు. రంగస్థలంపై ముగ్గులు అలికిన గోడలతో ఇళ్లే కాదు... వరికంకులు, ధాన్యం బస్తాలు, తూరుపాల... వంటి సంక్రాంతికి ముందు పంటపొలాల్లోని కల్లాల్లోని దృశ్యాలన్నింటినీ చూపారు. బంగారు నంది బహుమతులు పొందిన హింసధ్వని, వానప్రస్థం నాటకాలతో సహా 25 పైగా నాటిక/నాటకాలను రచించిన వల్లూరు శివప్రసాద్ రాసిన సంభాషణలు హత్తుకున్నాయి. ఇతివృత్తానికొస్తే వ్యవసాయ చట్రంలో కొనసాగుతున్న పల్లెటూరులో మూడుతరాల రైతు జీవితమిది. జీతగాడి పనిలో ఇమడలేని యువకుడు కౌలురైతుగా కాడిపడతాడు. స్వేదం చిందించి సేద్యం చేస్తాడు. సొంత భూమితో రైతవుతాడు. ఆయన బాటలోనే కొడుకు మరింత భూమిని సంపాదిస్తాడు. మంచి ఆస్తిపరులవుతారు. మూడోతరం వచ్చేసరికి సంపన్నుల ఇంటి కోడలు వస్తుంది. నగర జీవితంపై వ్యామోహం కాపురాన్ని పట్టణానికి మార్పిస్తుంది. తనను మరింత ధనవంతురాలిని చేస్తాడని మోసగాడిని నమ్మింది. భర్తను ఒప్పించి పొలం అమ్మించి సినిమాహాలు కడతారు. మోసపోతారు. కోర్టు కెళ్లినా న్యాయం దక్కదు. చివరకు రైతు కుటుంబం సర్వనాశనమైంది. మట్టికి, మనిషికీ ఉండే సంబంధాలు, వాటి మంచిచెడ్డలు, ఆ సంబంధాల్లోని మార్పులను నాటకం చక్కగా చూపింది.



మట్టిమనిషి నాటకంలో సన్నివేశం

పండుగలు సంప్రదాయాలకు ప్రతిబింబాలు

కొల్లిపర: పండుగులు సంప్రదాయాలకు ప్రతిబింబాలని అటు వంటి పండుగ సంప్రదాయాలను బావితరాలకు అందించాలనే తలంపుతోనే స్థానిక శ్రీ కళా నిలయం ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంక్రాంతి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని ప్రముఖ పారిశ్రామిక వేత్త కూరపాటి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణంలో శ్రీ కళా నిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు ప్రాంభించారు.ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన కూరపాటి రవిశేఖర్‌రెడ్డి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మోహినీ భస్మాసుర కూచిపూడి నృత్యం, విజేతలు అనే బాలల సాంఘిక నాటకం, విడాకులు కావాలి నాటకం వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి గుదిబండి మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు ఆరిమండ పెద్ద నాగిరెడ్డి, సహాయ కార్యదర్శి అన్నవరపు రమేష్, కార్యవర్గసభ్యులు ఆరిమండ శివశంకరరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



18న కఠెవరంలో వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

తెనాలి: రూరల్ మండలం కఠెవరంలోని రంగా సెంటర్‌లో ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. రాధారంగా మిత్ర మండలి, కఠెవరం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమ ఆహ్వాన పత్రికను సోమవారం స్థానిక వార్ఫ్ రోడ్డులోని తోటకూర వెంకట రమణారావు కార్యాలయం ఎదుట ఆవిష్కరించారు. బి.శ్రీనివాసరావు, బి.రాము సౌజన్యంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో వెంకటరమణారావు, తోట పానకాలరావు, సోమరౌతు సతీష్, కొండ్రెడ్డి రాంబాబు, నాగం వెంకటేశ్వరరావు, హరిదాసు గౌరీశంకర్, పసుపులేటి కిరణ్, తన్నీరు శ్రీనివాసరావు, యర్రు వెంకయ్య పాల్గొన్నారు.



మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, తెనాలి

Succession O.P 275/2024

Between:-

1) గడిపాటి మోహనదాసు గాంధి

2) చల్లపల్లి విజయలక్ష్మి ... పిటీషనర్స్

మరియు

ఫ్రాంక్లిన్ టెంప్లేటన్ ఇన్వెస్ట్‌మెంట్ అసెట్ మేనేజిమెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ... రెస్పాండెంట్స్

పై నెంబరు సెక్షెషన్ ఓపిలోని పటీషనర్సు, 1వ పిటీషనర్ భార్య గారు మరియు రెండవ పిటీషనర్ తల్లిగార్తైన లేటు గడిపాటి నిర్మలాదేవి తాలూకు రెస్పాండెంట్ వద్ద ఉన్న ఇన్వెస్ట్‌మెంట్ మొత్తమును అనగా FTI006 FTI BLUE CHIP FUND-IDCW & FTI 648 FT OVER NIGHT UNCL IDCWG స్కీమ్ క్రింద కనబడే పోలియో నెంబర్లు 1)30013566, 2)30013567, 3)30013568, 4)30013569, 5)14458703ను రెస్పాండెంట్ వద్ద నుండి పొందుటకుగాను సక్సెషన్ సర్టిఫికెట్ జారీ చేయవలసినదిగా కోరుతూ పిటీషన్ దాఖలు చేసియున్నారు. కావున ఆ విధముగా పిటీషనర్లకు సక్సెషన్ సర్టిఫికెట్ జారీ చేయుట గురించి ఎవరికైనను, ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ది.22-01-2025 ఉదయం 10.30గం॥లకు స్వయముగా కాని, ప్లీడరు ద్వారా కాని పై కోర్టు నందు హాజరై అభ్యంతరములు తెలియజేయవలసినదిగా ఈ జనరల్ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 22-01-2025

యస్.వి.శివ

పిటీషనరు తరుపు అడ్వకేటు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తెనాలి

EP 45/2021 in OS 133/2015

Between:-

కొల్లి రామిరెడ్డి ... DHR

మరియు

దావులూరు వెంకట్రామయ్య ... JDR

పై నెంబరు ఇపిలో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్ అయిన దావులూరు వెంకట్రామయ్య యొక్క దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారిచే ది.29-01-2025 తేది ఉ॥10.30ని॥లగాయితు వేలం జరుపబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది. కావలసినవారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి వేలంపాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, కొల్లిపర సబ్ డి॥ అన్నవరం గ్రామం డోర్ నెం.249/2 మింజుమలె య.0.90సెంట్లు భూమి హద్దులు తూర్పు: పామర్తి ముత్తయ్య, దక్షిణం: దావులూరు బసవేశ్వరరావు, పడమర: విష్ణుబట్ల సుజాత, ఉత్తరం: నరిపూడి విజయకుమారి, మొవ్వా సాంబశివరావు ఈ హద్దుల మధ్య య.0.90సెంట్లలో య.0.20సెంట్లు వేలం వేయబడును.

డి.హెచ్.ఆర్ విలువ : రూ.15,00,000/- అమీనా విలువ: రూ.20,00,000/- జె.డి.ఆర్ విలువ దాఖలు చేయలేదు. డేట్ ఆఫ్ సేల్ : 29-01-2025, డేట్ ఆఫ్ ఫర్దర్ హియరింగ్ 05-02-2025

నోట్ : EP షెడ్యూలు ఆస్తి దాఖలా య.0.90సెంట్లు అవిభక్త ఆస్తిని శ్రీ తెనాలి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో EP 10/17 in OS 324/14లో ది.18-08-24న వేలం వేయబడియున్నది. పై హద్దులలోని అవిభక్త య.0.20సెంట్లును షెడ్యూలు ఆస్తిలో దక్షిణమున శ్రీ కోర్టు వారిచే వేలం వేయబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో...

యం.కె.దీనదయాళ్

డి.హెచ్.ఆర్ తరుపు అడ్వకేటు